క్లుప్తంగా

పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



శాంతమ్మకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు రావాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ, నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డిని ఆలయ చైర్మన్ భగీరథ నవీన్ ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం వారిని కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈనెల 24న బ్రహ్మరథోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి రాత్రి దాకా ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: గౌడనకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కుంచిటి వక్కలిగ సంఘం డైరెక్టర్ బీ.టి.రామలింగప్ప భార్య లక్ష్మీదేవమ్మ (52) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్ గ్రామానికి వెళ్లి లక్ష్మీదేవమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. రొళ్ల, అమరాపురం జెడ్పీటీసీలు అనంతరాజు, స్వారక్క, తమ్మడేపల్లి సర్పంచ్ గిరిజమ్మ, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయ మండల ఉపాధ్యక్షురాలు లలితమ్మ తదితరులు మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వృద్ధులను ఆదరించండి



వృద్ధురాలికి పండ్లు అందజేస్తున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్: వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని న్యాయవాదులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీ నగర్‌లోని వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఎపిజి శ్రీనివాసరెడ్డి , బార్ అసోషియేషన్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ చట్టరీత్యా తల్లిదండ్రుల సంరక్షణ పోషణ వారి పిల్లలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోషణ కోసం ఆర్థిక సాయాన్ని అభ్యర్థించవచ్చాన్నారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. న్యాయవాదులు సుదర్శన్, ఈశ్వరప్ప, వృద్ధాశ్రమ నిర్వాహకుడు గంగాధర్, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. గౌడనహళ్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికల విద్యను ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలతో చిన్నారుల జీవితాలు అంధకారమవుతాయన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తుంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112 లకు సమాచారం అందిస్తే ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా చర్యలు తీసుకుంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహమూర్తి, సూపర్‌వైజర్ శంకరమ్మ, ఆర్డీటీ టీమ్ లీడర్ అదినారాయణ, సీఓ లక్ష్మణమూర్తి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టమాట వాహనం బోల్తా

మడకశిరరూరల్: బుళ్లసముద్రం గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారజామున టమాటలు మార్కెట్‌కు తరలిస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు అమరాపురం మండలం నుంచి హిందూపురం మార్కెట్‌కు బొలెరో వాహనం టమాట లోడుతో బయలుదేరింది. బుళ్లసముద్రం సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

- నియోజకవర్గంలో 65 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- వైద్య సేవలతో పాటు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ అధికారంలోకి వచ్చాక వైద్య ఆరోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి అధిక నిధులు కేటాయించి రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. గత ప్రభుత్వం వైద్య ఆరోగ్యరంగాన్ని పూర్తిగా విస్మరించడంతో పేదలకు వైద్య సేవలందక అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే పేదలకు గ్రామీణ స్థాయిలో కూడా వైద్య సేవలందించడానికి వీలుగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈక్లినిక్‌లు గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందిస్తున్నాయి.

అందుబాటులో వైద్యం

నియోజకవర్గంలోనే ప్రభుత్వం 65 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఒక్కో భవనానికి రూ.17.50 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే కొన్ని భవనాలు పూర్తి కాగా మరికొన్ని భవనాలు వివిధ స్థాయిలో ఉన్నాయి. క్లినిక్‌ల్లో ప్రజలకు 12 రకాల వైద్య సేవలందుతున్నాయి. రోజూ ఉదయం 9 నుంచి సాయంకాలం 4 గంటల వరకు పనిచేస్తాయి. ఇందులో 105 రకాల మందులను ఉచితంగా అందిస్తారు. 14 రకాల టెస్ట్‌లను కూడా నిర్వహిస్తారు. నెలకు రెండు సార్లు 104 వాహనంలో సేవలందించే డాక్టర్ ఈ విలేజ్ క్లినిక్‌లను సందర్శిస్తారు. వైద్యసిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను కూడా సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి వైద్య సేవలందిస్తారు. క్లినిక్‌లలో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)తో పాటు ఏఎన్ఎం,ఆశవర్కర్ విధులు నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా ఆయా క్లినిక్‌ల పరిధిలోని ప్రజలతో వారు సమావేశమై ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తారు.



మడకశిర మండలం గౌడనహళ్లిలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

నియోజకవర్గంలో పీహెచ్‌సీల వారీగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వివరాలు

పీహెచ్‌సీ పేరు	విలేజ్ క్లినిక్‌ల సంఖ్య
అగళి	11
అమరాపురం	07
గుడిబండ	10
రొళ్ళ	10
హేమావతి	07
కదిరేపల్లి	04
కల్లుమర్రి	07
నీలకంఠాపురం	05
గుండుమల	04

విలేజ్ క్లినిక్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రజలకు ఈక్లినిక్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. క్లినిక్‌లకు వెళ్లే ప్రజలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నారు. అవసరమైన మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతున్నాం. ఎప్పటికప్పుడు ఈక్లినిక్‌లను సందర్శిస్తున్నాం. ఆరోగ్య అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నాం.

–మంజువాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ,పెనుకొండ

జగన్ లాంటి సీఎం అవసరం



ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి మాకు అండగా నిలబడింది. పైసా ఖర్చు లేకుండా స్థానికంగానే వైద్య సేవలు పొందుతున్నాం. ఉచితంగా మందులు తీసుకుంటున్నాం. వైఎస్‌జగన్ లాంటి ముఖ్యమంత్రి ప్రజలకు ఎంతో అవసరం.

–పుట్టమ్మ,మధూడి,అగళి మండలం

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



గుడిబండ మండలం మద్దనకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: వచ్చే ఎన్నికల్లో సమష్టిగా పని చేసి జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కొంకల్లు, మద్దనకుంట, జీఎస్ తాండా వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి మడకశిర నియోజవకర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామన్నారు. సర్పంచ్ జగదాంబ క్రిష్ణ, నాయకులు నిరంజన్ స్వామి, హరీష్, నయాజ్ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేద్దాం

అమరాపురం: గ్రామాల్లోని నాయకులు కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ విజయానికి ఐకమత్యంతో కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. మంగళవారం తమ్మడేపల్లిలోని సర్పంచ్ గిరిజమ్మ ఇంటి ఆవరణలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగరవేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, నాయకులు సదానందగౌడ, హనుమంతరాయ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పథకాలందించడంలో వలంటీర్లదే కీలకపాత్ర

మడకశిర: ప్రభుత్వ పథకాలందించడంలో వలంటీర్లదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మడకశిర రూరల్ మండలం, మడకశిర మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తూ సేవా మిత్ర,సేవా రత్న,సేవా వజ్ర అవార్డులు పొందిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఈవ్యవస్థను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. వలంటీర్లు ప్రజాభిమానాన్ని పొందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచనల్లో వలంటీర్ల వ్యవస్థ కూడా ఒకటని గుర్తు చేశారు. వలంటీర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఉత్తమ సేవలందించిన వారికి సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులతో ఏటా సన్మానిస్తున్నారన్నారు. కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి, పీఏసీఎస్ చైర్మన్లు రామిరెడ్డి, చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ దాసరి మేరి,కోఆప్షన్ సభ్యులు క్రిష్ణమూర్తి, ఫకృద్దీన్, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు నాగేంద్ర, అన్సర్, స్థానిక నాయకులు సత్యనారాయణరెడ్డి, జయరాజ్, మంజునాథ్, సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.



అవార్డులు పొందిన వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు

మ్యాథ్స్ ఒలింపియాడ్ లో టేకులోడు విద్యార్థినుల ప్రతిభ



బి. జీవనసాహితి



జి. బేబీ



ఎమ్. అఫ్రీన్



పి. భానుశ్రీ



ఎం. అర్చన



జె. చరిత



వి.శిరీష



వి.గాయత్రి



కె.ఎమ్. చైతన్య



ఎస్. మానస

చిలమత్తూరు: టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు ఏపీ మ్యాట్ 50 వ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ శ్యామ్ భూపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తొలిర్యాంక్‌తో పాటు ఏకంగా ఏడుగురు విద్యార్థినులు టాప్ 10 లో ర్యాంక్ సాధించారన్నారు. బి.జీవనసాహితి(9వతరగతి) రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంక్, జి. బేబీ(8వ తరగతి), ఎం.అఫ్రీన్(9వ తరగతి), పి.భానుశ్రీ(9వ తరగతి) రెండో ర్యాంక్, ఎం.అర్చన(9వ తరగతి) జె.చరిత(8వ తరగతి) మూడవ ర్యాంక్, వి. శిరీష(8వ తరగతి) నాల్గవ ర్యాంక్, వి. గాయత్రి(8వ తరగతి) ఐదవ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. సీనియర్ విభాగంలో కె.ఎమ్ చైతన్య(ఇంటర్ మొదటి సంవత్సరం) రాష్ట్రస్థాయిలో తొలిర్యాంక్, ఎస్ మానస(ఇంటర్ మొదటి సంవత్సరం) మూడవ ర్యాంక్ సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

'ఎస్‌ఐను సస్పెండ్ చేయండి'

పావగడ: కర్ణాటక రాష్ట్రంలోని రామనగర జిల్లా ఐజూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సయ్యద్ తన్వీర్ హుసేన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ పదాధికారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కక్షిదారుల సలహా మేరకు కోర్టు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషనందన్ మాట్లాడుతూ రామనగర జిల్లా బార్ అసోసియేషన్ కు చెందిన 40 మంది న్యాయవాదులపైన అబద్ధపు కేసులు నమోదు చేసిన ఎస్ ఐ సయ్యద్ తన్వీర్ హుసేన్ ను వెంటనే సస్పెండ్ చేసి అతని పై న్యాయ పరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరసింహ మూర్తి కి వినతి పత్రం అందించారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

రొద్దం: బీదానిపల్లిలో టీడీపీ సర్పంచ్ మంజునాథ్ ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతుండగా అధికారులు అడ్డుకున్నారు. వివరాలు.. సర్వేనంబర్ 27లో 3 సెట్లు ప్రభుత్వ స్థలం ఉంది. అందులో సర్పంచు షెడ్డు నిర్మిస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఓ రాము, ఎస్‌ఐ వలీబాషా గ్రామానికి చేరుకుని నిర్మాణాన్ని అడ్డుకున్నారు.

వాహనాల తనిఖీ

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డుపై మంగళవారం రాత్రి మడకశిర పట్టణ సీఐ మనోహర్ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖామాత్యులు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని బోయపేట, అర్బన్ కాలనీ, యాదవగేరి, కుమ్మరిగేరి ప్రాంతాల్లో మంత్రి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. మొదట బోయగేరిలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసిన మంత్రి మహర్షికి నివాళులర్పించారు. కరపత్రాలను ఆయా కుటుంబాలకు అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పెనుకొండలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఎల్లవేళలా సంతోషంగా ఉండాలని ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సమయానికి తగ్గ విధంగా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే డబ్బు జమ చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వసతి దీవెన విద్యా దీవెన, రైతుభరోసా, నేతన్న నేస్తం ఇలా ప్రతి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రజలకు అందించారన్నారు. మాట తప్పని మడమ తిప్పని నేత జగనన్న అని, టీడీపీ తప్పుడు మాటలకు మోసపోవద్దన్నారు. గతంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారని మరోసారి ఆయనకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలకు పాతర వేస్తారన్నారు. చంద్రబాబు లాంటి మోసగాడు దేశంలోనే లేడన్నారు. వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులను ప్రతి ఒక్కరినీ మంత్రి ఆప్యాయంగా పలకరించారు. పలు సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్సార్‌సీపీ నేత చరణ్ రెడ్డి, నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ బోయ సునీల్, కన్వీనర్లు బోయనరసింహ,నాగలూరుబాబు, జెడ్పీటీసీలు గుట్టూరు శ్రీరాములు, డీసీ.అశోక్, ఎంపీపీ గీత, కౌన్సిలర్లు బోయ హారతి, సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, సద్దాం, తయూబ్, శేషాద్రి, భాస్కర్‌నాయక్, రామాంజినేయులు, జయశంకరరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, గుట్టూరు ఆంజినేయులు, కొండలరాయుడు, వెంకటరత్నం, రమాకాంతరెడ్డి, ఉప సర్పంచ్ వేణు, కృష్ణారెడ్డి, ఫరీద్, గణేష్, మురళి,శ్రీరాములు, యాసిన్, రాము, శ్యాపురం లక్ష్మీనారాయణ, నాయుడు, రాజశేఖరరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, పార్టీ నాయకులు

సంక్షిప్త సమాచారం

కర్ణాటక మద్యం పట్టివేత

పరిగి: పెద్దిరెడ్డిపల్లిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నాగేష్ అనే వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 50 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఇదిలా ఉండగా సాయంత్రం ఎస్‌ఐ వాహనాల తనిఖీ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు.

పెనుకొండ రూరల్: అడదాకులపల్లిలో నవీన్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 15 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు.

23న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

హిందూపురం: మాఘ పౌర్ణమి సందర్భంగా ఈనెల 23వతేది సాయంత్రం 5 గంటలకు అరుణాచలం క్షేత్ర దర్శనానికి సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం ప్రకటనలో తెలిపారు. 24 ఉదయం అరుణాచలం చేరుకుని గిరి ప్రదర్శన ముగించుకుని అరుణాచలేశ్వరుడి దర్శనం అనంతరం తిరిగి 25న హిందూపురం చేరుకుంటుందని పేర్కొన్నారు. రూ.1,360 చెల్లించి రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 8977885997కు సంప్రదించాలని సూచించారు.

చింత ఫలసాయం వేలం

అమరాపురం: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న చింత ఫలసాయాన్ని మంగళవారం పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో వేలం వేశారు. ఉలియప్ప అనే వ్యక్తి రూ.24 వేలకు వేలం దక్కించుకున్నాడు.

తుంగభద్ర జలాలను విడుదల చేయండి

పావగడ: తుంగభద్ర జలాలను తాగునీటి అవసరాలకు వెంటనే విడుదల చేయాలని స్థానిక కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయం ఆవరణలో రెండు రోజులుగా ఆందోళన చేపడుతున్న ఆయన మాట్లాడుతూ సంబంధిత ఇంజనీయర్లు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పైప్ లైన్ పనులు ఇంకా పూర్తికాలేదని ఆరోపించారు. వెంటనే పనులు పూర్తి చేసి నీటి ని వదలాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏసి శివప్ప కు వినతిపత్రం అందించారు.

పిల్లల చదువుపై శ్రద్ధ వహించండి

రొళ్ల: పిల్లల చదువుపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో రెండో రోజు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న సగం మంది ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశ పెట్టామన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



చిక్కీలు అందిస్తున్న సీడీపీఓ, విప్రో హెచ్ఆర్

హిందూపురం అర్బన్: పౌష్టికాహారంతో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని సీడీపీఓ రెడ్డి రమణమ్మ పేర్కొన్నారు. మంగళవారం అప్పలకుంటలో వాసవ్య మహిళా మండలి, విప్రో సహకారంతో కుశాల్ హెల్త్‌కేర్ క్లినిక్ వారు స్పురలిన చిక్కి అందజేశారు. విప్రో ప్లాంట్ హెచ్ఆర్ రామకృష్ణారావు మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ, హెచ్ఐవీ, బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్ రాకకు కారణాలపై అవగాహన కల్పించడమే కాకుండా సంస్థ తరఫున వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా మారెమ్మదేవి జాతర



అలంకరణలో మారెమ్మదేవి

రొద్దం: కోగిర గ్రామంలో మారెమ్మదేవి విగ్రహాన్ని ప్రతిష్టించి 40 రోజులు కావడంతో మంగళవారం అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గ్రామ దేవతను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. గ్రామ మహిళలు గ్రామ దేవతకు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు, ఇతర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



మృతుడు శివ

హిందూపురం అర్బన్: పట్టణంలోని బాలాజీ సర్కిల్ వద్ద మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం దావణగెరకు చెందిన శివ(40) భార్య పిల్లలను వదిలేసి ఐదేళ్లుగా స్థానికంగా రహమత్‌పూర్‌లో ఉంటూ రీలింగ్ యూనిట్‌ల వద్ద పని చేసుకొంటూ జీవనం సాగించేవాడు. వచ్చిన కూలి డబ్బుతో మద్యం సేవించేవాడు. మద్యం మత్తులో ఉన్న అతడు బాలాజీ సర్కిల్ వద్ద కింద పడి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య రక్ష

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ ఆరోగ్య రక్ష లభిస్తోందని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో కల్లుమర్రి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. సర్పంచ్ రంగమ్మ, డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్, అనూష, ఈఓఆర్డీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు..వైద్యులు ప్రణత్‌కుమార్, మహమ్మద్ చాంది, శ్రీనివాస్‌రావు, శివనంద, గాయత్రి రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి అశోక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రొళ్ల మండలం బీజీ హళ్లిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేట గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వైద్యులు దాదాపుగా 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ఉదయ్ కుమార్, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, సుధాకర్ నాయక్ వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

రొళ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, సర్పంచ్ సదాశివప్ప పేర్కొన్నారు. మంగళవారం బీజీ హళ్లిలోని ఆర్డీటీ కమ్యూనిటి భవనం ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సౌందర్య, కాశి విశ్వనాథ్, క్రిష్ణసాగర్ తదితరులు 476 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులనుఅందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ క్రిష్ణప్ప, పీహెచ్ఎన్ సుధారాణి, ఆరోగ్య, ఆశ వర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.